పాతవస్తువుల సేకరణ .. పర్యావరణానికి రక్షణ

- 15 ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల ద్వారా సేకరణ
- పాత మున్సిపల్ భవనం పైన శాశ్వత ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్

సత్తెనపల్లి: పర్యా వరణాన్ని పరిరక్షించేందుకు పాత వస్తువులను సేకరించి .. అవసరమైన వారికి అందించేందుకు పట్టణాల్లో కొత్త కార్యక్రమానికి ఇటీవల శ్రీకారం చుట్టారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ స్వచ్ఛభారత్ మిషన్ 2.0 ఆధ్వర్యంలో మేరీ లైఫ్ .. మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలో పలు చోట్ల ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) పేరుతో మొత్తం 15 చోట్ల ప్రారంభించారు. ఇళ్లల్లో వాడి పడేసిన వస్తువులు, వినియో గంలో లేని ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వస్తువులను ఈ కేంద్రాల్లో అందిస్తే వాటిని అవసరమైన వారికి ఇవ్వటం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మరొకరికి ఉపయోగపడేలా ..

ఇప్పటికే పురపాలికలో ఇంటింటా చెత్త సేకరిస్తున్నా .. యార్డు చెత్తతో నిండి పోయింది. దీంతో ప్రతి రోజు పట్టణంలోని 31 వార్డుల నుంచి వెలువడే 22 మెట్రిక్ టన్నుల చెత్తల్లో 17 టన్నుల పొడి చెత్తను జిందాల్‌కు, 5 టన్నుల తడి చెత్తను మహీంద్రా అండ్ మహీంద్రా కు తరలింప చేస్తున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో వినియోగంలో లేని వస్తువులను అందిస్తే వాటిని రీసైకిల్ చేసి మళ్లీ వినియోగంలోకి తెస్తారు. దుస్తులను తిరిగి ఉపయోగపడేలా కుట్టి ఆశ్రమాలకు తరలిస్తారు. వాటితో పాటు పెన్నులు, కుర్చీలు, డస్ట్ బిన్నులు, ఇతర వస్తువులను తయారుచేసి ఉద్యాన వనాల్లో ఏర్పాటు చేస్తారు. దీంతో రహదారుల పక్కన వ్యర్థాలు తగ్గుతాయని కాలు ష్యాన్ని కొంతవరకు నిలువరించవచ్చని అధికారులు చెబుతున్నారు.



పట్టణంలోని 19,20 వార్డుల ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో సేకరించిన వస్తువులు అందుకుంటున్న కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు, కూకుట్ల శ్రీనివాసరావు

సేకరణ ఇలా...

పురపాలికలో గత నెల 26న ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను ప్రారంభించారు. వినియోగం లోలేని వస్తువులను ఈ నెల 5 వరకు పట్టణంలోని 15 సచివాలయాల్లో తీసుకుని ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలకు తరలించారు. ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలకు ప్లాస్టిక్ 93 కేజీలు,దుస్తులు 259 కేజీలు, పాతపుస్తకాలు 174, చెప్పులు, బూట్లు 218 వచ్చాయి. వీటిని సరి చేసి ఆశ్రమాలకు, పేదలకు అందించనున్నారు. పట్టణంలోని పాత మున్సిపల్ భవనం పైన శాశ్వత ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ఉంటుంది. ఈ సెంటర్‌కు ఎప్పుడైనా ఇళ్ళలో వినియో గంలో లేని వస్తువులను పంపవచ్చు.

పర్యావరణ పరిరక్షణకు....

పట్టణంలో రోజుకు 22 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది.క్రమంగా చెత్త భారం పెరుగుతుండటంతో కార్మికులు డంపింగ్‌యార్డుకు తీసుకువెళ్లడానికి ఇబ్బందికరంగా మారింది. ఈక్రమంలో జిందాల్‌కు, మహీంద్రా అండ్ మహీంద్రాకు తరలిస్తున్నారు. వినియోగించిన



పట్టణంలో సేకరించిన వస్తువులు

పాత వస్తువులు, పాత దుస్తులు, వాడిన చెప్పులు, బూట్లు, ప్లాస్టిక్ బుట్టలు వంటివి రోడ్ల పై, మురుగు కాలువల్లో ప్రజలు పడేస్తుండటంతో పర్యా వరణానికి హని కలిగిస్తున్నాయి. వీటి పై ప్రజలకు పురపాలకసంఘ అధికారులు అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నం చేస్తుండటంతో పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది.

ముగిసిన గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం

క్రోసూరు: గత నెల 6 వతేదీన గ్రంథాలయంలో ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం తో ముగిసినట్లు గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ ఆదివారం తెలిపారు. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా సాంబయ్య, ఉపాధ్యాయులు సుభాని పాల్గొన్నారు. విజ్ఞాన శిబిరంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి రోజు గ్రంథాలయానికి వెళ్లి పుస్తక పఠనం చేయడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చునన్నారు. ఉపాధ్యాయులు మూర్తి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు బాల బాలికలకు విజ్ఞానాన్ని పెంపొందించుటకు దోహదపడతున్నాయని అన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో ఆరోతరగతి ప్రవేశపరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఆదర్శపాఠశాల ప్రవేశానికి గాను ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు పాఠశాలకు హాజరై ప్రవేశ పరీక్ష రాశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ వేళాంగిణి మేరీ మాట్లాడుతూ పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను ఆరోతరగతిలో 100 సీట్లు భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించామన్నారు. ఆన్‌లైన్ ద్వారా 91 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 78 మంది హాజరయ్యారని 13 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామన్నారు.

వేసవిలో దుక్కులు లోతుగా దున్నుకోవాలి

ముప్పాళ్ళ: వేసవిలో దుక్కులు లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలని, వాలుగా అడ్డంగా దున్నుకోవడం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూలంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. వేసవిలో చాలా వరకు భూమి ఖాళీగా ఉంటుంది. ఆ సమయంలో పంటలను ఆశించే అనేక రకాల పురుగులు, పంటకోత దశల్లో నిద్రావస్థ దశలో ఉంటాయి. తెగుళ్ళను కలుగ చేసే శిలీంద్రాలు తదితరమైనవి భూమి లోపల ఆశ్రయం పొందుతాయి. లోతుగా దుక్కులు దున్నడం వల్ల భూమిలోని చీడపురుగుల కోశాలు, గుడ్డు, లార్వాలు, గుడ్లను, పక్షులు, కొంగలు, కాకులు తిని వాటిని నాశనం చేస్తాయి. లోతుగా దున్నడం వల్ల శిలీంధ్ర బీజాలు మట్టితో పాటు పైకి వస్తాయి. బయట అధిక ఉష్ణోగ్రతలకు అవి చనిపోతాయి. వేసవి దుక్కులు దున్నే ముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడం వల్ల అవి విసర్జించిన వ్యర్థాలు భూమిలోకి చేరి సేంద్రియ పదార్థం తయారవుతుంది. ఫలితంగా భూసార వృద్ధిలో ఎంతగానో ఉపయోగపడుతుంది. కలుపు మొక్కల నివారణ వగైరా ప్రయోజనాలు సమకూరతాయి. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించినట్లయితే పంటలను తెగుళ్ల బారి నుంచి కాపాడు కోవచ్చన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిత

సత్తెనపల్లి: విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని సత్తెనపల్లి టౌన్ ఎస్‌ఐ ఏ. రఘుపతి రావు అన్నారు. వావిలాల బ్యాట్‌మింటన్ ఇండోర్ స్టేడియంలో వేసవి క్యాంపు శిక్షణ ముగిసిన సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్‌ఐ రఘుపతిరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న తనం నుంచే క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. తమకు ఇష్టమైన క్రీడలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. శిక్షణకు హాజరైన క్రీడా కారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

వైఎస్సార్ బీమా రెన్యువల్‌కు సహకరించండి

అమరావతి: మండల పరిధిలోని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ప్రభుత్వం కల్పించే వైఎస్సార్ బీమా రెన్యువల్ చేయడానికి లబ్ధిదారులు సహకరించాలని ఎంపీడీఓ మాధురి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న 16 గ్రామ సచివాలయాల్లో ఇప్పటికి సుమారు 68 శాతం పూర్తయిందన్నారు. దిడుగు, ధరణికోట-1,2, అత్తలూరు, లింగాపురం, ఉంగుటూరు, మల్లాది, జూపూడి గ్రామ సచివాలయాల్లో 78 నుంచి 85 శాతం వరకు పూర్తయిందన్నారు. అలాగే నెమలికల్లు, నరుకుళ్ళపాడు, కర్లపూడి, ఎండ్రాయి, అమరావతి-1, మునగోడు, వైకుంఠపురం, అమరావతి-2గ్రామ సచివాలయాల్లో 47 నుంచి 67 శాతం వరకు పూర్తయిందన్నారు. మండలం మొత్తం మీద 22208 మంది లబ్ధిదారులుండగా అందులో 2265 మంది అనర్హులు ఉన్నారని మిగిలిన 19943 మంది లబ్ధిదారులలో 13062 మంది మాత్రమే రెన్యువల్ చేయించుకున్నారన్నారు. మిగిలిన 6881 మందికి వైఎస్సార్ బీమా రెన్యువల్ చేయాల్సి ఉందన్నారు. గ్రామ సచివాలయ కార్యదర్శులు వలంటీర్లను సమన్వయ పరుచుకుని నూటికి నూరుశాతం వైఎస్సార్ బీమా రెన్యువల్ చేయడానికి లబ్ధిదారులు సహకరించాలని ఆమె కోరారు.

రైతులు పశువుల బీమా చేయించుకోవాలి

అమరావతి: మండల పరిధిలో పశువులు పెంచే రైతులందరూ తప్పక పశువుల బీమా చేయించుకోవాలని మండల పశుగణాభివృద్ధి శాఖ ఏడీ వెంకట్రామయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ పశుబీమా పథకం ద్వారా పాడి ఆవులు, పాడి గేదెలు, కాడి ఎద్దులు, కాడిదున్నలు, ఆరు నెలలు నిండిన గొర్రెలు, మేకలు, పందులకు ఈపథకం వర్తిస్తోందన్నారు. ఎస్సీ ఎస్టీలకు 80 శాతం సబ్సిడీపైన, ఇతరులకు 50 శాతం సబ్సిడీపైన బీమా ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. మేలు రకం పాడి ఆవులు, పాడి గేదెలు, కాడి ఎద్దులు, కాడిదున్నలకు రూ.30 వేల రూపాయల బీమా వర్తింపు అలాగే నాటు పాడి ఆవులు, పాడి గేదెలు, కాడి ఎద్దులు, కాడిదున్నలకు రూ.15 వేల రూపాయల బీమా మూడు సంవత్సరాలకు వర్తిస్తుందన్నారు. అలాగే పందులు, మేకలు, గొర్రెలు 6 వేల రూపాయల బీమా రెండు సంవత్సరాలకు వర్తింస్తుందన్నారు. బీమా చేయించుకోవాల్సిన రైతులు మిగిలిన వివరాలకు ధరణికోట, వైకుంఠపురం, నరుకుళ్ళపాడు పశువుల ఆస్పత్రుల్లో సంప్రదించాలన్నారు.

నిదానంపాటి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి అంబటి

రాజుపాలెం: మండలంలోని బలిజేపల్లిలో వేంచేసి ఉన్న నిదానంపాటి అమ్మవారిని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయనతో పాటుమాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, సర్పంచ్ గౌతుకట్ల జ్యోతి, గౌతుకట్ల గురవయ్య, సర్పంచ్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న మంత్రి అంబటి, మాజీ ఎమ్మెల్యే యర్రం

రెండు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం

సత్తెనపల్లి: పట్టణంలోని 25వ వార్డ్ సంఘం బజార్‌లో నివాసం ఉంటున్న పసుమర్తి మోహన రావు, కొప్పరావురి రత్తయ్య తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండడంతో విషయాన్ని స్థానికులు ద్వార తెలుసుకున్న ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ తన మిత్ర బృందంతో విరాళాలు సేకరించాడు. ఆదివారం ఆ రెండు నిరుపేద కుటుంబాలకు తన బృందంతో వెళ్లి వారికి సుమారుగా రూ. 40 వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రతి నెలా కుటుంబ సరుకులు అందిచే విధంగా తోడ్పాటు అందిస్తామన్నారు. సాయం చేయడానికి ముందుకు వచ్చిన కొత్త రామకృష్ణ, వారి బృందానికి ఆ రెండు కుటుంబాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కొత్త రామకృష్ణ సేవా తత్పరతను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పొట్టి రాజేశ్వరరావు, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, కుమార్, వంకా అనిల్, చెక్క రవి కుమార్,పెరుమాళ్ళ సుధాకర్, తదితరులు ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న కొత్త రామకృష్ణ

రాహు-కేతువులకు విశేషపూజలు

నకరికల్లు: నర్శింగపాడు గ్రామంలో వేంచేసిన శ్రీఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రాహు-కేతుపూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో రాహు-కేతులను విశేషంగా అలంకరించారు. రాహు-కేతులకు పూజించేందుకు ఆదివారం ప్రత్యేకమైనది కావడం, పల్నాడు ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన రాహు-కేతుల ఆలయం కావడంతో పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.